కథ

# మాయ

గంటేడ గౌరునాయుడు

"ఎవుర్రా యీ వేలప్పుడు..."

నిద్రలోంచి బద్ధకంగా లేచి గడపలో కొచ్చి లైటువేసి గ్రిల్స్ లోంచి చూసేడు... ఇల్లంనాయుడు.

"నేను మామా..." మంచు గాలిలో నల్లదుప్పటి ముసుగేసుకుని చలికి వొణుకుతూ రోడ్డుమీద నిలబడ్డ అతని గొంతును గుర్తుపట్టి "నువ్వురా... రాజూ ఏట్రా... యేటయ్యింది!" అనడిగేడు ఆత్రుతగా. అడిగి తలుపు తీయబోయేడు. తాళం వేసివున్న సంగతి గుర్తుకొచ్చింది. ఇల్లు కొత్త. ఇంటికి తాళం వెయ్యడమూ కొత్త.

మాటల అలికిడికి లేచి తాళం తీసింది ఇల్లంనాయుడి కూతురు.

కార్తీకమాసపు చివరి రోజులు.

దట్టంగా వెలిబూడిదలా రాలుతోంది మంచు.

కొత్త పంచెలసాపు కప్పిన మృతదేహంలా వున్నాడు మంచుతెరల్లో చంద్రుడు.

లైటు వెలుగులో పరకాయించి రాజును గుర్తుపట్టి "రారా బావు లోపలికి... రోడ్డుమీదే నిలబడిపోయావేమి?" అని పిలిచింది.

"రాడాకి లేదొదినీ... అవతల... సిరంజీవులు మామ లేడా..."

ప్రమాద సంకేతమేదో ఆ గొంతులో స్ఫురించి అదిరిపడ్డారు యిద్దరూ.

రాజు దగ్గిరగా వొచ్చి గుసగుసగా చెప్పేడు. ఒక్కక్షణం నిశ్చేష్టుడయ్యేడు ఇల్లంనాయుడు. అతని మెదడు మొద్దుబారిపోయింది.

"సాయంత్రం ఎంత బాగా మాట్లాడేడు. ఊరు సంగతుల నుండి కేంద్ర రాజకీయాలదాకా... బయటకి బాగా వున్నట్టే కనిపిస్తున్నాడు గానీ... ఆడి మనసును సెదపురుగులాగ దొలుస్తున్న బాధొకటుంది. పెద్దకూతురు చేసిన పనిని మరిచిపోలేకపోతున్నాడు. వ్యసనాలకి అలవాటు పడిన అన్నలు తన పెళ్ళి చెయ్యలేరనే అనుకుందో... పట్నం పోకిరి గాలి మాయలోనే పడిపోయిందో గానీ వొక ఆటోడ్రైవర్‌ని ప్రేమించానని ఆడితో లేచిపోయింది. అదొక మనోవ్యాధి చిరంజీవులు నాయుడికి..."

టైం చూసేడు. మూడు గంటలు కావస్తోంది.



"పదరా బావ్..." అదురుతూన్న గుండెతో అడుగు బయట పెట్టేడు.

"చలి యెక్కువుంది గదా... చలిబాడీ తొడుక్కోని యెల్లు. యిదా యీ శాలువా కప్పుకోని తలకి మఫ్లేరు సుట్టుకో" అని ఇంట్లోంచి తెచ్చి యిచ్చింది కూతురు.

కొత్తగా వెలిసిన ఊరు.

సున్నం వేసిన కొత్త గోడలతో పొగమంచులో తడుస్తూన్న ఆ చిన్నా పెద్ద ఇళ్ళనడుమ నడుస్తుంటే సమాధుల మధ్య నడుస్తున్నట్టే అనిపించింది ఇల్లంనాయుడికి.

వీధిలో మంటపెట్టి చుట్టూ కూర్చున్నారు కబుర్లాడుతూ కొందరు.

గడపల్లో మంచాల్లోనే ముసుగులు బిగదీసుకుని కొందరు... చిరంజీవులు- నాయుడి గుణగుణాల గురించి మాట్లాడుకుంటూ. ఆడవాళ్ళు వర్ణ వర్ణాలు పెట్టి ఏడుస్తున్నారు రాగాలు తీస్తూ. చలిగాలి వారి దుఃఖంలా సుడులు తిరుగుతోందక్కడ.

ప్రశాంతగా నిద్రపోతున్నట్టే వుంది చిరంజీవులునాయుడి ముఖం.

అతని తల దగ్గర మట్టిదీపం నిశ్చలంగా వెలుగుతోంది.

ఇల్లం నాయుడికి కుర్చీ చూపించి 'ఏటిసేస్తాం' అన్నట్టు చూసేరందరూ.

ఆయా కుటుంబాలవారే కాక ఆ వూళ్ళో అందరూ తమ 'పెద్ద'గా గౌరవిస్తారు ఇల్లంనాయుడిని. కథా కార్యాలప్పుడు, తగవులు తంటాలప్పుడు ఇల్లంనాయుడి సలహా సహకారాల్తో నడుచుకుంటారు.

"అసలేటయ్యిందిరా" అడిగేడు చిరంజీవుల్నాయుడి పెద్ద కొడుకు- మోహనరావుని.

"ఆడీలోకంల వుంటేగదా... ఆడే నా యిడిమైతే... ఈ పర్రాకులన్నీ యేల? రాత్రి యేలపొద్దున కసింత తినీసి గడిసేపు భాగవతం తీసి సదివినాడు. కార్తీకమాసం గదా. మనవరాల్ని వొడిలోన కూకోబెట్టుకోని ఎన్ని కవుర్లు సెప్పినాడనుకున్నావు. అందరమూ యిలాగ సపోరించినాం. రొండో ఆట సూసుకోని వచ్చాడు పెద్దోడు. వొచ్చినోడు ఎలగొచ్చినాడంతావూ... ఫుల్లుగున్నాడు. చిట్టితల్లి లెగిసి వడ్డించింది. 'యిదేం తిండి' అని దాన్ని-కొట్టేడు. కోపమొచ్చి తండ్రేదో అన్నాడు... యీడు ఎదురు సమాధానం సెప్పినాడు. అంతే. ఏ రాత్రప్పుడు యీ పని సేసినాడో కానుకుకోలేప్పోనాం. యిదా... యీ డబ్బా..." పురుగుల మందు డబ్బా చూపించి బావురుమన్నాడు చిరంజీవులు నాయుడి తండ్రి. మోకాళ్ళచుట్టూ చేతులు బిగించి ముడుకుల్లో ముఖం దాచుకున్నాడు. ఏడుస్తున్నట్టు అతని వొళ్ళు కంపించడం తెలుస్తూంది.

మంచుతో తడిసిన గాలి వుండి వుండి తెరలు తెరలుగా వీస్తోంది.

వీధి చివర చింతోల ముసిల్దాని కోడిపుంజు రెండుసార్లు కూసింది.

"అందరికీ ఫోన్లు చేస్సారు గదా..."

"అప్పజెల్లిలు రాఁవులమ్మకే కవురందలేదు. ఎదురింటోళకి ఫోన్‌చేస్తే చెప్తామన్నారు. మియాపూర్ నుండి వచ్చీదాక శవాన్ని వుంచగలమా...?"

"కష్టమే. అసలే బలవంతపు సావు"

ఇల్లంనాయుడు చుట్టూ చూసేడు. చూసి "ఒరే బావ్. యీ మాట ఎక్కడా అనకండి. ఒకదానికొకటి" అన్నాడు హెచ్చరికగా.

తూరుపు తెల్లబడుతోంది.

ఊళ్ళో వాళ్ళంతా ఒక్కొక్కరూ చేరుతున్నారు.

దగ్గర దగ్గర వూళ్ళ నుండి వచ్చిన చుట్టాలు జనాలతో వీధి... ఇళ్ళ గడపలూ నిండుతున్నాయి. జనంలోంచి అన్నారెవరో....

"కాష్టంకి కర్రలు కొట్టడానికి... మేళాంకి... సాకలి... మంగళ్ళకి కవురెట్టండి"

గతుక్కుమన్నాడు ఇల్లంనాయుడు.

* * *

"బావూ... మీకు కోపమొత్తే నాను సెప్పలేను. మీరు పెద్దోలు. మా నౌకరోలమాట సెల్లదు. అయితేటి... యిరుకుజూసి సురకబెడతన్నాడ్రా యీడూ అని మీరనుకోప్పోతే నా దొక మనివి" అని తల గోక్కున్నాడు- అప్పోజి.

"ఏట్రా..." విసుగ్గా చూసేడు ఇల్లంనాయుడు.

అందరూ అప్పోజినే చూస్తున్నారు అసహనంగా.

"బావూ- యిప్పుడు నానేటి సెయ్యగల్ను. మీ పార్టీల తగువుల్తోటి నా కొడుకుని పనికి రావొద్దనీసి సిచ్చ సెప్పేసినారు. ఆడెంత యింస పడ్డాడో మీరెరగరు. ఆ బాధతోటే వూరొగ్గేసినాడు. ముంపు పేకేజి డబ్బులు వొచ్చి

నాయి. పట్నంల సెలూన్‌బడ్డీ ఎట్టుకున్నాడు. యిక నా మాటంతారా... కూకుంతే నెగలేను... నెగిత్తే కూకోలేను. అడుగుతీసి అడుగెయ్యలేను నా నేటి సెయ్యగల్ను వూరి నౌకరి". దగ్గు ఆయాసం మధ్య తన అశక్తతను ఆక్రోశాన్ని వెళ్ళగక్కేడు అప్పోజి.

"... యింతకీ నువ్వన్నిదేట్రా..." ఎవరో కోపంగా అరిచేరు.

"యింకేట్రా ఆడు అంత సొస్టంగ సెప్తుంతే..."

"ఒరే పిల్లి గుడ్డిదైతే ఎలక అదేటో సూపించిందట... మన లోకువ కనిపెట్టినారు... ఆలిష్టమొచ్చినట్టు ఆళ్ళాడతన్నారు. మన తడాకా యేంటో సూపెడితే..." మీదికొచ్చేడు ప్రెసిడెంటు తమ్ముడు.

"యీడొకడు... కిందా మీదా సూడడు. అన్నిటికీ కలబడిపోడమే... అందరికి తెద్దుమా కొందరికి తెద్దుమా అనీ... ఎట్రా..." కసిరేడు ఇల్లం నాయుడు.

"బావుల్లారా... మీ సాకిరి సేసి బతికినోలిమి. మీరు మరొకలాగ అనుకుంతే నాను సెప్పలేను గానీ పాలిచ్చిన ఆవుని తగిలీసి కొమ్ములిసిరిన ఎద్దుని తెచ్చుకున్నాట్ట... మా వోడిని గెంటీసి ముక్కు మొకం తెలీనోడ్ని పనికి తెచ్చుకున్నారు. మీ తాతల తండ్రులప్పుడు- కాసి సేవజేసినోలుమనైనా ఆలోసించలేదు. 'సాకలి కొత్త మంగలి పాత అంతారు. అదయినా తెలుసుకోకుంట ప్రవర్తిల్లినారు. ఆకరికి యేటయ్యిందీ... ఆ వొచ్చినోడు అందినకాడికి అప్పులు జేస్సి పరారైపోతే... యిప్పుడు గింజుకుంతంద్రు... కాలూ సెయ్యి లేనోళ మీద కలబడిపోతే తిరిగి మామేటి సెయ్యగలమా- సెందగలమా... అదిగో మారాజుకొడుకు బట్టంతే... పాతంతే... తిండికి లేన్నాడు బత్తిమంతే జరిపీవోడు. కడసారి మొకము సూద్దునని నడ్డీడుసుకోని వచ్చినాను. యేలినవోరి దయ. సంపిత్తే సంపీయండి" అని రెండు చేతులూ ఎత్తి దండం పెట్టేడు అప్పోజి.

ఇల్లంనాయుడు ఏమీ అనలేకపోయేడు.

అప్పోజి దేక్కుంటూ అక్కడినుండి కదిలేడు.

రెండు జాముల పొద్దెక్కింది.

రావలసినోలంతా వచ్చేరు... వలసెళ్ళిపోయిన వారిలో రావలసిన నొకరిద్దరు తప్ప.

"అయితేటి సేత్తామ్రా... శవం ముందల కుంపటి పట్టుకోవలసినోడు... మెళం కట్టవలసినోడు ఎవలూ లేకుంట ఎలగ తీసికెల్తాం" విసిగిపోతున్నాడు ప్రెసిడెంటు తమ్ముడు.

ఎంద్రా యింక అంబల్లేలయిపోతంది. రావలసినోలందరూ ఎలిపొచ్చినారు. అవతల తిళ్ళుతిప్పలు లేకుంట ఎంచేపుంతారు? కడుపుతో వున్నోళు పచ్చి గంగయినా ముట్టరు పీనుగెల్గిందాకా... లెండ్రా లేగి..." తొందర చేసేడు నడిమింటి కాశినాయుడు.

"ఒరే... నువ్వుంద్రా యీకూ తెలీదు సీకూ తెలీదు. రెండూ తెలీదూ రాముడు కత. పెద్దోలు ఏదో ఆలోసించుతన్నార గదా" అని కాశినాయిడ్ని కసిరి జేబులోంచి కింగ్‌సైజు ఫిల్టర్ సిగరెట్ పేకెట్ తీసి వెలిగించాడు మంతిని సిమ్మడు.

"ఏటివోయ్ బావా... సీను మారింది. కరీం బీడీ కట్ట నుంచి ఫిల్టర్ కింగ్‌కి పెరిగిపోయింది లెవిలు. మీ పనే బాగుందివోయ్ ప్రోజెక్టు దర్మాన కళ్ళుగానని సొమ్ము. ఇంటికి స్థలమూ... అదీ పట్నందగ్గిర. ఇల్లు కట్టుకోడాకీ... మడిసెక్కలకీ... లచ్చలమీద సొమ్ము. మా వూరూ అలగ ములిగిపోతే బాగున్ను... అవునోయ్... యేటి సేస్తారువోయ్ ఆ సొమ్మంతా... అదృష్టమంతే మీదేనివోయ్..." పొరుగూరు నుంచి వచ్చిన చుట్టమొకడు హాస్యమాడేడు.

"ఆ... ఆ... అదృష్టమంతే అంతా యింతే. ఇంటికి జాగాలిచ్చి నలభై వేలుతోటి ఇళ్ళు కట్టుకోవాలన్నారు. దాంతోటి ఇల్లు అయిపోద్దేటి? మడిసెక్కలకి యిచ్చిన సొమ్ము ఇళ్ళమీద పెట్టీసినాం. గోవుపాదమంత జాగా లేదిప్పుడు యవసాయం సేద్దుమంతే. కొందరయితే సొమ్ము సేతల పడింది లగాయితూ... జల్సాలు సాయంత్రమయ్యేసరికి యిస్త్రీబట్టలు ధరించీసి పట్నంల సికార్లు. యి బీర్లు- బిరియానీలు వొకటేటి, వున్నకాడికి తగలబెట్టేస్తండ్రి. ఈ సంవత్సరంకి తిండిగింజలున్నాయి. కూకోని తింతన్నాం. దినం దీరిపోతంది. యిప్పుడు తెలీదు. వొచ్చే యేడాదికి తెలుస్తాది. బండీ బక్కా అమ్ముకోని ఎలిపొచ్చినాం. యవసాయం లేదు. పనీపాటు లేకుంట తిరగడంతోటి బద్ధకం బలిసిపోయి మరొక పనిసెయ్యడాకి వొళ్ళొంగదు. అప్పుడు బోధపడతాది అదృష్టమేదో..."

ఆ మాటకి అందరూ మౌనంగా వుండిపోయేరు కొంతసేపు. అందరిలోనూ యేదో బాధ ముల్లులా గుచ్చుతోంది.



"ఈ ప్రాజెక్టువల్ల మనకి సుకం లేదురా... అని నెత్తి గొట్టుకోని చెప్పాను.నా మాట ఎవులూ పట్టించుకోలేదు. బొమ్మళ్ళందిన కుండమీద ఎన్ని బకెట్లు నీళ్ళు పోత్తే మాత్రం యేట్లాబం? లచ్చలసొమ్ము ఎప్పుడు కళ్ళజూస్తాము. పట్నం దగ్గిర సోటు మనం ఎప్పుడైనా కొనగలమేటి అని సెంకలెగరేసినాం. పోనీ అందిన సొమ్ముతోటి మరొక్కాడ మడిసెక్కలు కొనగలిగినామా... లేదు. ఒక వూరు రెండూళ్ళయ్యింది. పార్టీ తగువుల్తోటి సాకళ్ళని, మంగళ్ళని వొదిలీసినాం. గుడ్డముక్కంతే సబ్బెట్టి గుంజుకుంతాం. గెడ్డాలంతే. రేజరుతోటి సేసుకుంతాం. సమర్తలంతే... సావులంతే... అవెలాగవుతాయి. ఎంతకి పట్నం గాలి తగిలినా ఆచారాలు... సాంప్రదాయాలు అవెలాగ వొదులుకోగలం..."

తన మాట కాదన్నందుకు ఫలితం అనుభవిస్తున్నాం సుమా అన్న భావం వ్యక్తం చేసేడు బబ్బాది గోపినాయుడు.

"నిజమే. ఎవులుమూ అంత దూరం ఆలోసించలేదు. అయినా... తర్నుం తెలీనిచ్చినారేటి ఆపీసర్లు. జీపీల్తోటి ఎలిపోరాడం... మీటింగులని గాబరా పెట్టీడిం..." వొప్పుకున్నాడు ప్రెసిడెంటు.

ఎవరో 'టీ' తెచ్చారు పళ్ళెంలో గ్లాసులు పెట్టి.

అందరూ తీసుకున్నారు.

వీధిలో ఎండ పడుతోంది. వొళ్ళు వెచ్చబడుతోంది. కప్పుకున్న దుప్పట్లు తొడుక్కున్న స్వెట్టర్లు తీసి పక్కన పెడుతున్నారు కొందరు. సిమ్మంటు రోడ్డు మీద జనం అక్కడక్కడ గుంపులు గుంపులుగా రకరకాల చర్చల్లో.

పక్క గ్రామం నుండి వచ్చిన ఎవరో అన్నారు.

"ఈ స్లేబిళ్ళూ... సిమ్మెంటు రోడ్లు అన్నీ బాగున్నాయి గానీ నాకయితే యిది ఊరులాగ కనబడలేదు సుమీ..."

అందరూ అతనివేపు ఆశ్చర్యంగా చూసేరు.

"ఊరంతే... అయిదారు వీధులు... వీధికి నలభయ్యో యాభయ్యో స్లేబిళ్ళు వుంతే సరా...? ఊరంతే ఎలాగుండాల.... అందలోనా రైతులున్న వూరు. ఇల్లు... ఇంటిముందు ధాన్యపు గాది, గాదెనక పశువుల సాల, సాలలోన పశువులు, సేనికుప్పలు యేసుకోడానికి కళ్ళం. కళ్లంపక్క గత్తానికి పెంటకుప్ప వుండాలా? ఊరు మద్దిని రామ్మందిరం, ఊరవతల అసిరమ్మగుడి, యివేవి యిక్కడ? ఇక



WORLD No.1
జపానీ లింగవర్ధక యంత్రం
100% చికిత్స హామీ
కేవలం 500 రూపాయల్లో జపానీ లింగవర్ధక యంత్రం
Vald Santosh Kr. Gupta, P.O. Katri Saral, 805105 (Nawada)

నౌకరోలు, సాకలి... మంగలి... కుమ్మరి... కమ్మరి... దేవాంగులు... ఎరకలి... అందరూ వుంతేనే గదా అది వూరు. వొదిలీసి ఎలిపొచ్చినారు గానీ వూరంతే అదే... నాలుగు వక్కల తోటలు... సుట్టూ పెండి... సెట్టూ సేమలతోటి పంటపొలాల్తోటి ఏటివక్క ఎంత గొప్పగా వుండీది" గుర్తు చేసుకున్నాడు.

"నిజఁవే... ఆ కొత్తపేట యెల్లి ఆడిని యీడిని బతిమాలి ఆళ్ళ కళ్ళాలంట సేనికుప్పలు యేసుకోవలిసొచ్చింది. ఆలెప్పుడు తీసీమంతే అప్పుడు తీసియ్యాల. అంత నిరబందనొచ్చింది" ఒకడు బాధపడిపోయేడు.

"పట్నం దగ్గిరయితే పిల్లల సదువులకీ... అవసరాలకీ... యాపారలకీ... యవ్వారాలకీ అన్నిటికీ బాగుంతాదనుకున్నాంగానీ యిలగని ఎవులు కలగంతారు సెప్మీ..." ఒక రైతు వేదన.

"అవుసరంకి దగ్గిర... వ్యసనంకి దూరము అన్నట్టుండాల. పట్నం కాపరం అంట పట్నంకి అల్లంత దూరంలోన పల్లెటూరి కాపరమే మంచిది సుమా..." సూత్రీకరించేడు బబ్బాది గోపినాయుడు.

"నిజఁవే సిరంజీవులు దద్ద ఎప్పుడూ యిదే అనీవోడు. మనలాటోళ్ళం పట్నంల బతకలేంరా అని. ఏదైనా పని మీద పట్నమెల్లవలసొచ్చినా ఎంత బేగి మనూరు యెలిపోదుమా అని సూసీవోడు. సినీమాకి ఎల్దుముదద్దా" అంతే వొప్పీవోడు కాదు. ఊరు ఖాళీసేసిన్నాడయితే... పాలు తాగిన కుడుబ్బెయ్యిని పొదుగు నుండి లాగితే ఎలాగ గింజుకుంతాదో అట్టి సందాయింగే... గిలగిలలాడిపోనాడు. ఊరుదాటి వొచ్చినాడు. మన సొగ్గేసినాడు. దానికి తోడు స్థిరంలేని కొడుకులు. ఆళకి మరొక పని లేదు. పొలాన పంటయేటయ్యిందో అక్కర్లేదు. పాపం యితగానే సీకటి తోటి బస్సెక్కెళ్ళి పొలంకాసి సూసుకోని యే అంబల్లేలప్పుడో వొచ్చేవాడు. ప్చ్... కొడుకులు అలగ... కూతురిలగ... అది భరించలేకే... తెంపరించీసినాడు..."

"పల్లకో... గట్టిగనకు..."

"... ఇంకేటి ఆలిసిం? యేల మించిపోతంది గదా..."

గుర్తు చేస్తున్నాడు మాటిమాటికీ వైస్ ప్రెసిడెంటు.

"ఔనుగానీ పీనుగుని ఎక్కడ దహనపరుస్తారు? మీ వూరువల్ల కాదుకి జాగా యెక్కడ సూపెట్టింది గవరమెంటు?" ఎవరో ధర్మ సందేహం వ్యక్తం చేసేరు.

"ఔన్నిఁవే... ఎక్కడ? యీ సంగతే ఆలోసించలేదు... ఊరు ముంపుకి గురవుతుందన్నప్పుడు అందరూ ఊరికి జాగా యెక్కడిస్తారు? ఇంటికెంత? భూములకు రేటెలాగ? యిదే ఆలోచించారు గాని ఊరుమ్మడి జాగాల గురించి ఎవులికీ లేకపోయింది" అందరిలోనూ స్మశానం జాగా గురించిన ఆలోచన అప్పుడు మెదిలింది.

"దద్దా... ఆ సాకలగుంపడు కాష్టం పేర్సడాకి రానని కరాకండీగ సెప్పేసినాడు. 'నా అవుసరంకి వూరు లేప్పోతే వూరు అవసరంకి నానెందుకుండాల' అని నిర్మొగమాటంగ అనీసినాడు. ఆడికి అక్కడే రెండు తగల్నిద్దునుగానీ మరేల... యిది సమయం గాదు. అయినా ఆడెందు కొత్తాడు సేతినిండ సొమ్ము, సొంత లేండ్రీ షాపు పట్నంల. ఆడింక లొంగుతాడు మనకి. అప్పుడే లిష్టులోన ఆడి ఇల్లు రాయడం మానిత్తే అప్పుడు తెలిసుండీది. మరేల...?"చాకలిగుంపడు రాడన్న సంగతి తేల్చేసేడు గుంపడిని పిలవడాకి వెళ్ళిన రాములు పెద్ద పెద్ద కేకలు వేస్తూ.

"ఔన్రరా... ఆడు రాడు. అయితేటి పీనుగుని యిలగుంచెత్తామేటి? పదండి మనమే ఆ పని సేసిద్దుంగాని. ఆశారమే... అయితేటి యిప్పుడె లగవుద్ది పదండి" అని గొడ్డలి తెచ్చేడు సన్యాసినాయుడు. కొందరు కుర్రాళ్ళు భుజాన కర్రలు మోసుకుని పట్నంకి ఆనుకుని వున్న కొత్తపేట స్మశానంకేసి వెళ్ళేరు.

రోడ్డుమీద నులకమంచం వేసి శవ స్నానానికి కుండలతో నీళ్ళు పసుపు కుంకుమ... అక్షితలు సిద్ధం చేసేరు ఆడవాళ్ళు.

చిరంజీవుల్నాయుడి మేనత్త కొడుకు గున్నయ్య కుంపటి పట్టుకోడానికి తయారయ్యేడు.

పాడె ఎత్తుతుండగా పరుగు పరుగున వచ్చేరు కుర్రాళ్ళు.

ఒకడన్నాడు-

"అక్కడ దహనపరచడానికి ఎంతమాత్రమూ వొల్లగాదట. ఆ కొత్తపేటలో వొప్పుకోలేదు. మీ వూరోలు మరొక్కాడ వల్లకాడు సూసుకోండి యిక్కడ పనికిరాదు" అనీసినారు. ఎంత బతిమాలినాం గానీ కాదనీసినారు".

ఎత్తిన పాడె దించీసేరు.

అందరూ గొల్లుమన్నారు.

ఏం చేద్దామన్నట్టు అంతా ప్రెసిడెంటువేపు చూసేరు.

ప్రెసిడెంటు ఇల్లంనాయుడివేపు చూసేడు.

ఇల్లంనాయుడు కొంచెసేపు ఆలోచించి చెప్పేడు.

"మన పాత వూరికి తీసికెలిపోడం తప్ప మరొక దారి లేదు".

... ... ...

ఎవ్వరూ మాటాడలేదు.

"... అదీ వొకందుకు మంచికే... తమ్ముడు ఎప్పుడూ అనీవోడు "పుట్టిన మట్టీమీద బుగ్గయిపోడమూ వొక అద్రుష్టమే కదా..." అని. నాలుగు రోజుల కిందట ఆడన్నమాట తలుసుకుంతే కడుపుల దేవెత్తందనుకో. "అన్నా... ఆ వూరు సూత్తే ఇళ్ళు తిరగబడిపోయి మొండిగోడలతోటి వల్లకాడు- దిబ్బయిపోయి నక్కలు దుమ్మలగుండులు తిరుగుతిన్నాయిరా... గుర్తుకొస్తే తిండి సయించడం లేదురా అని... ఎంతో బాధపడ్డాడు. ఆడికి ఆ మట్టిమీద మమకారం పోలేదు. ఆ యేటొడ్డు, ఏవసెట్టు ఆడి నేస్తాలు. మరందుకే అక్కడికే తీసికెల్లి దహనపరిచిద్దుంగాని. దూరమే... అయినా తప్పదు"

ఎండ... ఆకలి... జనంలో అసహనం.

"... యింకేటర్రా ఆలోసించుతారు. అంబళ్లేల దాటితే మళ్ళీ సాయంత్రందాక అవ్వదు. అందలోన మామూలు సావు గాదు. ఎంత బేగి వూరు దాటించిత్తే అంత మంచిది".

తొందర పెడుతున్నారు కొందరు.

ప్రెసిడెంటు ఎవరికో ఫోన్ చేసేడు ట్రాక్టరు కోసం.

శవవాహకులు సిద్ధమయ్యేరు.

"మేళం లేకపోతే లేదు. భజనయినా సెయ్యండ్రా".

గుర్తు చేసేరెవరో. భజనం సమాజం కుర్రాళ్ళు డోలక్కు... తాళాలు తీసేరు.

"ఎవుల్ని పల్లెత్తుమాట అనడం ఎరగడు".

"బీదా బిక్కి అంతే ఎంత దయో..."

"అన్యేయమంతే వొప్పోడు గాదు"


"కస్తవా బొరిగి భుజానేసుకోని మడిగట్టుమీద రాగం తీసుకోని నడుత్తుంతే..."

"హరిశ్చంద్రుడి వేషం కట్టి స్టేజీ ఎక్కితే సూపులు సూదాల. కాటిసీను పజ్యాలు పాడితే కళ్ళంట నీరు తిప్పనోడు లేడు".

"ఎటువంటోడైతే యేటి... యీనాటికీ కరమ్మొచ్చింది. కొడుకులు దిప్పరగొట్టోలయిపోయి వ్యసనాలు నేర్సి అందినకాడికి సొమ్ము ఆరిపేసినారు. కూతురా అలగజేసింది. ఎవల్ని సూసుకోని బతకాలని అనుకున్నాడు గావాల..."

(మిగతా 30వ పేజీలో)

"ఔన్నిఁవే... ఎక్కడ? యీ సంగతే ఆలోసించలేదు... ఊరు ముంపుకి గురవుతుందన్నప్పుడు అందరూ ఊరికి జాగా యెక్కడిస్తారు? ఇంటికెంత? భూములకు రేటెలాగ? యిదే ఆలోచించారు గాని ఊరుమ్మడి జాగాల గురించి ఎవులికీ లేకపోయింది" అందరిలోనూ స్మశానం జాగా గురించిన ఆలోచన అప్పుడు మెదిలింది.



# మాయ

(22వ పేజీ తరువాయి)

చిరంజీవులు నాయుడి మంచితనం గురించి ముచ్చటించుకుంటున్నారు.

కుంపటితో శవం ముందు నడిచేడు గున్నయ్య.

"ఏమి అనాశారంరా మంగలిపనీ సాకలిపనీ అన్నీ మనమే సేసుకోవలసి వచ్చింది గదా" వాపోయాడు దివిటీ పట్టుకున్న సన్యాసయ్య.

మనవడు ముందలితనాలు జల్లుతుండగా పాడె రోడ్డును సమీపించింది. దాపుడుకళ్లం ఆశ తెంపుకుని నారాయణ నారాయణ నారాయణ అని మూడుసార్లు భగవన్నామస్మరణ చేసి శవాన్ని ట్రాక్టర్‌లోకి ఎక్కించారు. పాతిక ముప్పయి మందిదాకా బండిలో ఎక్కేరు. ఇల్లంనాయుడిని డ్రైవరు పక్క కూర్చోబెట్టేరు.

పొద్దు నడినెత్తికొచ్చింది.

ట్రాక్టరు కదిలింది.

అప్పుడొచ్చింది చిరంజీవుల్నాయుడి అప్పజెల్లిలు... నోటికి పయ్యాడకొంగు అడ్డం పెట్టుకుని కుమిలి కుమిలి ఏడుస్తూ....

"పోన్నే... కడసారి అన్నమొకం సూడ్డాకి అందింది..." అనుకున్నారు. గుండెలు బాదుకుంటూ యేడుస్తున్న ఆడోళ్ళను బలవంతంగా వెనక్కి పంపించి ట్రాక్టరు ఎక్కేడు చిరంజీవుల్నాయుడి వీరకాడు సింహాచలం నాయుడు.

ఇల్లంనాయుడికి అంతా కలలో లాగా వుంది.

చిరంజీవులు నాయుడు మరణించాడన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడతను. క్రితం రాత్రిదాకా తనతో కబుర్లాడినవాడు; ఏ చిన్న

**ఊరు మారింది. ఇల్లు మారింది. మనుషుల తీరు తిత్తవ మారింది. ఇళ్ళలోకి రంగులటీవీలొచ్చాయి. ఎడ్లూ... బళ్ళూ యెలిపోయి మోటారుబళ్ళొచ్చాయి, పొలం పనులు లేవు... పట్నం షికార్లొచ్చాయి... బీర్లు బిరియానీలు వొచ్చాయి... సోకులు... సరదాలు... విందూ వినోదాలు వొకటేటి... రారానివన్నీ వొచ్చాయి...**

పనైనా తనకు చెప్పిగాని చేయనివాడు; అన్నా అని ఆప్యాయంగా పిలిచినవాడు.

"చిరంజీవులు నాయుడు బావ్ రాగం తీసి పురాణం సదివితే ఇల్లం నాయుడు బావ్ అర్థం సెప్పాల..." అని వూరంతా గొప్పగా చెప్పుకోడం గుర్తుకొచ్చి అతని కళ్ళు నీటితో నిండిపోయేయి. అటువంటి చిరంజీవుల్నాయుడి శవయాత్రకి చావుమేళం లేదు; కాష్టం పేర్చడాకి చాకలి లేదు; వల్లకాడూ లేనట్టయ్యింది.

ఇలాంటి చిత్రమైన స్థితి మొదటిసారి చూస్తున్నాడు ఇల్లంనాయుడు. వందల యేళ్ళుగా పేమిన వర్ణవర్ణాల దారాల బలమైన తాడు పోటికిపోయి పుటుక్కున తెగిపోయినట్టయ్యింది.

బండి కదిలింది.

'ఏమన్నేయంరా... తంబ్రీ నారాయణమూర్తీ... ఎటువంటి మనిషికి యిటువంటి కష్టమొచ్చిందీ. ఊరు మునిగిపోద్దీ అన్నారు. గుండె ఎండబెట్టుకున్నాడు. పుట్టి బుద్దెరింది లగాయితూ మారాజు తంబ్రి వూరు దాటి యెరగడు. బొత్తిగా సత్తిగాలపోడు. బతికిన బతుకంతా ఆ యేటొడ్డునే. తెల్లారి ఏటికాసెల్లి ఏటొడ్డు యేపసెట్టు రెమ్మ యిరిసి మూడికిలు నవిలి పొలంపని నూసుకోని ఏటిల స్నానంచేసి వచ్చీవోడు. కష్టమైనా సుకమైనా యేపసెట్టుతోటీ... ఆ యేటితోటీ సెప్పుకోని గుండెబరువు దించుకొనీవోడు. ఊరు ఖాళీ చెయ్యమన్నప్పుడు చిన్నపిల్లడిలాగ కళ్ళంట నీరు తిప్పుకున్నాడు. ఇంటికీ... పొలాలకీ రేటు కట్టినపుడు ఆడిమొకం సూత్తే భయమేసింది... పొలమంతే గవర్మెంటుకది ఖరీదు కట్టే స్థలమే కావొచ్చుగాక... అన్నా పొలమంటే రైతు వొళ్లేగదరా. నా వొంటికి ఖరీదు కడతారా? నా బతుక్కి రేటు కడతారా? అని ఎంత కుమిలిపోయాడో. అప్పుడు కాసి మనసొదిలీసినాడు. ఊరు మారింది. ఇల్లు మారింది. మనుషుల తీరు తిత్తవ మారింది. ఇళ్ళలోకి రంగులటీవీలొచ్చాయి. ఎడ్లూ... బళ్ళూ యెలిపోయి మోటారుబళ్ళొచ్చాయి, పొలం పనులు లేవు... పట్నం షికార్లొచ్చాయి... బీర్లు బిరియానీలు వొచ్చాయి... సోకులు... సరదాలు... విందూ వినోదాలు వొకటేటి... రారానివన్నీ వొచ్చాయి... యివన్నీ చూసినాడు. మనిషి పితలాయించీసినాడు. కూతురు తీసుకున్న నిర్ణయంతో మరింత కుంగిపోయాడు. బండీ బక్కా- లేనోడు... పొలము పుట్రా లేనోడు పకీరోడవుతాడుగాని రైతెలాగవుతాడు అని కృశించిపోయేడు.... ఔను యిప్పుడెవ్వులుమూ రైతులం కాము... అందరమూ... పకీరోళమే... పంటభూమికి పరాయోళ్ళమే'.

ఇల్లంనాయుడి గుండె బరువెక్కిపోయింది. దెబ్బ తగిలినచోట చర్మం తిమిరెక్కి కొంత సేపయ్యాకే గాయంనొప్పి వొంటికి తెలిసొచ్చినట్టు ఊరిని వొదిలి వచ్చాక యీ నాటికి యిప్పుడు బాధ అనుభవంలోకి వస్తోంది.

"ఇల్లంనాయుడు మామా ఊరొచ్చింది" ఎవరో పిలవగా ఆలోచనల్లోంచి తేరుకున్నాడు.

చూసేడు ఊరు ఖాళీ చేసేక మళ్ళీ యిదే రావడం.

అతని గుండె కలుక్కుమంది.

కూలిన మిద్దెలు, విరిగిన అరుగులు... పెచ్చులూడిన గచ్చులు... మొండిగోడలు... మట్టిదిబ్బలు. యుద్ధానంతర శిథిల నగరాన్ని చూస్తున్న యోధుడిలా నిశ్చేష్టుడైపోయేడు. జరిగిన యుద్ధాల గురించీ... పత్రికల్లో చదివాడు. ఎందరో చెప్పగా విన్నాడు. కానీ యిప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నట్టుంది. 'యుద్ధం లేదు... బాంబులు లేవు. ఊళ్ళు మాత్రం వల్లకాటి దిబ్బలవుతున్నాయి. మనుషులమా... నడపీనుగుల్లాగున్నాం. ఎందుకిలాగ? ఎవులు చేస్తున్నదిది? ఎవరి ప్రయోజనం కోసం?' ఇల్లం నాయుడి బుర్రలో ఎన్నెన్నో ప్రశ్నలు.

గెద్ద వొకటి అతని తలమీదుగా ఎగిరి ఓ యింటి మొండిగోడ మీద వాలింది.

బండి దిగి వీధిలో అడుగు పెట్టేడు.

మొండి గోడల మీద చేరిన కాకుల గుంపు మనిషి అలికిడికి ఎగిరి చెట్ల మీదికి చేరేయి.

'పెద్దలు పేరంటోళ్ళు శిథిల గ్రామాన్ని చూడాలని వొచ్చాయి గావాల' అనుకున్నాడు.

రామమందిరం మెట్లు మీద నుండి ఏదో పాము నెమ్మదిగా లోపలికి పాకుతోంది మెలికలు తిరుగుతూ.

నాయుడోళ్ళ వీధిలోంచి సందులు తిరిగి చిరంజీవులు నాయుడింటి గడపలో అడుగు పెట్టేడు. నక్కలు రెండు ఇంట్లోంచి బయటకు పరుగు తీసేయి.

ఈ గడపలోనే గదా తమ్ముడు పురాణం చదివితే నేను అర్థం చెప్పింది. పురాణం వినడాకి వొచ్చినోళ్ళు యీ అరుగుల మీదనే కదా కూర్చుండీవోళ్ళు.

అరుగుమీద నిలబడి చూస్తే దూరంగా వెదురు వేపచెట్ల సందుల్లోంచి నిదానంగా ప్రవహిస్తో... ఓ అనాథలా కనిపించింది నాగావళి.

గాలి తెర విసిరికొట్టింది.

కళ్ళలో ధూళి పడి కళ్ళు కరకరలాడేయి.

ఇళ్ళ పెరళ్ళలోని కొబ్బరిచెట్లు గాలికి వూగే రెమ్మలతో దెయ్యాల్లా కనిపించేయి. ఒక్క క్షణం వొళ్ళు జలదరించింది.

ఎత్తైన ఆ అరుగుమీద నిలబడి చుట్టూ చూసేడు.

ఎన్ని వందల యేళ్ళయ్యిందో యీ వూరిక్కడ వెలిసి.

ఎన్ని పండుగలో... ఎన్ని సందడులో... ఎన్ని వసంతాలో... ఎన్ని పున్నములో... ఎన్నెన్ని పంటలు... ఎన్నెన్ని భాగ్యాలు... ఎన్ని కళ్యాణాలెన్ని కాపురాలెన్ని సౌభాగ్యాలు... ఎన్ని బంధాలు... ఎన్నెన్ని అనుబంధాలు... ఆటలు... పాటలు... అసిరమ్మ పండుగల వాలకాలు... కళ్ళు తిరిగినట్టయి అరుగు మీద నెమ్మదిగా చేరబడ్డాడు. ఆ అరుగు మీద కూర్చుని చిరంజీవులునాయుడు ఎప్పుడూ యిష్టంగా పాడే పద్యం... కరుణ- రసార్ద్రంగా చెవిని సోకినట్లయ్యింది.

'మాయామేయ జగంబె నిత్యమని సంభవించి మోహంబునన్..."

ఔను... మాయామేయ జగమే. ఎక్కడ చూసినా మాయే. మాయలేని సోటు లేదు. మాయ కాప్పోతే యిదేటి? ఎవులో ఎవలి కోసమో చేస్తున్న మాయే. బలైపోయింది మాత్రం మేము. ఎక్కడో మొదలైన మాయ యిక్కడ మా బతుకుల్ని ముంచీసింది. మనిషిని మనిషిలాగే వుంచి

→

గుండికాయని తీసేసిన మాయ. మరి మాయ గాదా. పేకేజీలు... పరిహారాలు అని కళ్ళ ముందు మాయమెరుపులు మెరిపించి ఇళ్ళూ మళ్ళే గాదు వూళ్ళకు వూళ్ళే మాయ జేస్తున్న మాయగాళ్ళెవులో... అళ్ళనీ ఆడిస్తున్న మహామాయగాళ్ళింకెవులో యేటో. యీ మాయకి మొదులెక్కడో... యీ మాయ సాగరమదనంలోన విషం మాయదానకొట్టి అమ్మృతము... ఐరావతము... కామధేనువు... కల్పవృక్షము అవతల ఎవళకి సమర్పించుకోడానికో? ఆ మాయదేవత లెవులో మరి...'

పురాణాల నుండి చరిత్రను దాటి వర్తమానందాకా అదే 'మాయ' కొనసాగుతుంది కదా అనిపించింది ఇల్లంనాయుడికి. మారింది కాలమేగాని మాయలో మార్పు లేదనిపించింది. అతని పెదాల మీద వాడిన పువ్వులాంటి నవ్వొకటి జారి గాలిలో కలిసిపోయింది.

"బావా... అవతల పొద్దు గుంకి పోతంది గదా..." వీరకాడు పిలిచేడు.

"ఔసుగదా... పొద్దుగుంకిపోతంది గదా... నిజఁవే గదా" అనుకుంటూ భారంగా అడుగులేస్తూ వొచ్చేడు బండి దగ్గరికి.

గుండెల్లో దుఃఖం సుడులు తిరగ్గా ఎవరో అంటున్నారు.

"సూడండ్రా బావ్ మన వూరు శుంగారము... వైభోగము... ఎప్పుడో ఎవులో శాపం పెట్టేసినారు గావాల".

బండి కదిలింది వల్లకాడు వేపు.

ఇది నా వూరేనా... ఇది నేనడిచిన దారేనా

తల్లి నా పల్లె తీరే మారెను... చూసే కన్నులు చెమ్మగిల్లెను....

నిర్వాసితుల సభలో రామినాయుడు పాడిన పాట బండివెనకే వొస్తున్నట్టుంది... వెంటాడుతూన్నట్టుంది.

చితి యార్పాట్లలో పడ్డారు కొందరు. నాగావళి వొడ్డున చిరంజీవులు నాయుడి మడిలోనే కూర్చున్నారు మిగితావాళ్ళు దిగాలుగా.

"... ముంపు భూములకి తగిన రేటు కోసం ధర్నాలు చేసి లాఠీ దెబ్బలు తింటేగానీ పని జరగలేదు... యిప్పుడు 'మా వూరికి వొల్లకాడు కావాల' అని మళ్ళీ ధర్నా చెయ్యాల గావాల. మా వూరికి రోడ్డు కావాలనో... బస్సు కావాలనో... ఆసువత్రి కావాలనో అడుగుతారు ఎవరైనా... కానీ 'మాకో వల్లకాడు కావాల' అని అడుగుతున్న వాళ్ళం చరిత్రలో మనమే మొదటోళ్ళం గావాల" స్మశానవాటిక కోసం ధర్నా ఆలోచన బయటపెట్టాడో యువకుడు.

"ఈసారి ధర్నాలోన ఎవలెవలికి యేటేటి యిరుగుతాయో సూడాల..." గతంలో ధర్నా చేసినపుడు జరిగిన లాఠీ చార్జీలో విరిగిన మోకాలును తడుముకుంటూ అన్నాడో కుర్రాడు నవ్వుతూ.

పొద్దు పడమటి తాటిచెట్ల గుబురుల్లోకి జారుతోంది.

ట్రిటీటివ్... ట్రిటీటివ్... ట్రిటీటివ్...

గాల్లో గిరికీలు కొడుతూ ఎగురుతోంది తీతువ్వ.

సందె వెలుగులు ప్రతిఫలించి యుగయుగాలుగా ఎందరో ముత్తైదువుల పసుపు కుంకుమలు కడిగి తనలో కలుపుకున్న అపరాధ భావనతోనో యేమో ఎరుపు పసుపు రంగులు కలగలిసిన చిత్రవర్ణంలో జాలిజాలిగా ప్రవహిస్తోంది నాగావళి.

చితికి నిప్పంటించడానికి యేర్పాట్లు పూర్తయ్యేయి.

చిరంజీవులు నాయుడి పెద్దకొడుకు భుజాన నీళ్ళకుండతో చితిచుట్టూ ప్రదక్షిణం చేసేడు మూడుసార్లు.

మూడు నీళ్ళ ధారల కోసం గొడ్డలి మొనతో మట్టి కుండకు మూడు గంట్లు పెట్టేడు గున్నయ్య. శవంమీది కొత్తబట్ట సగానికి గొడ్డలి అంచుతో చించి దాన్ని శవం మీద కప్పేడు.

'ఎవరున్నా లేకున్నా ఎవరికోసము యేదీ ఆగదు గదా... అనుకున్నట్టే తాను పుట్టిన మట్టిమీదే పిడికిడు బుగ్గి అయిపోతున్నాడు తమ్ముడు'.

ఇల్లంనాయుడి కళ్ళలో పల్చని నీటితెర.

అతని నుదుటిని చల్లగా తాకి కళ్ళలోకి జారుతున్న తెల్లని జుత్తును సవరించి సాగిపోయింది పిల్లగాలి తత్వగీతంలాగా.

చిరంజీవులు నాయుడును ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటున్నట్టు చితిమంటలు ఉవ్వెత్తున లేచేయి.

అంతా రేవులో దిగేరు స్నానాలకోసం.

నాగావళి అందరినీ ఆప్యాయంగా కౌగలించుకుంది చాన్నాళ్ళకి వచ్చిన చుట్టాలకు స్వాగతం చెప్పినట్టు.

చలికి వణుకుతూ తడిబట్టలతో వొడ్డెక్కినవారికి అప్పుడు గుర్తొచ్చేడు ఇల్లంనాయుడు.

"ఔనర్రా... మా బావేడీ..." చుట్టూ చూసేడు ఇల్లంనాయుడి భార్య తమ్ముడు.

ఏటివొడ్డున ట్రాక్టరు చక్రానికి చేరబడి కనిపించేడు ఇల్లంనాయుడు. అతని ముఖం ఊరివేపు తిరిగి వుంది. కప్పుకున్న శాలువా వో పక్కకి జారి గాలికి ఎగురుతోంది.

"బావా..." చేత్తో తట్టేడు వీరకాడు ఇల్లంనాయుడి భుజం మీద.

గాలి రివ్వున వీచింది.

మంటలు మరింత ఉధ్ధృతమయ్యేయి.



## ఆదిమానవుని కళాసృష్టి

రాతియుగపు మానవులు ఆహారాన్వేషణలో భాగంగా గుంపులు గుంపులుగా సంచరిస్తూ కొండ గుహలలో, చెట్ల తొర్రలలో ఆశయం తీసుకుంటూ జంతువుల నుండి, ప్రకృతిశక్తుల నుండి రక్షణ పొందుతూ ఉండేవారు. అయితే ఆకలి తీరి కాస్త తీరిక దొరికినప్పుడు మానవునిలో ఉన్న కళాకారుడు నిద్ర మేల్కొనేవాడు. తనలో వున్న సృజనాత్మకతను మేళవించి తను జీవించిన కాలం నాటి చెట్లు, జంతువులు, మనుషుల బొమ్మలను పదునైన గట్టి రాతి మొనల నుపయోగించి గుహల గోడలపై గండరించడమో (engrave) లేక వివిధ సహజ రంగులనుపయోగించి చిత్రించడమో చేసే వారు. అలా చిత్రించిన ఎన్నో రాతి చిత్రాలు ప్రపంచంలో చాలాచోట్ల దర్శనమిస్తాయి. ముఖ్యంగా ఫ్రాన్స్, స్పెయిన్‌లు ఆదిమానవుని రాతికళకు ఎంతో పేరు పొందాయి. ఇటీవల కాలంలో ఫ్రాన్స్ లో 'ఏంజెల్స్-సుర్-ఐయాగ్లిన్' అనే చిన్న గ్రామంలోని కొండగుహలలో కనిపించిన ఆదిమానవుని కళా ప్రతిరూపాలు అబ్బురపరుస్తున్నాయి. క్రీస్తుపూర్వం 13000-15000 సంవత్సరాల మధ్య జీవించిన మానవులు ఇక్కడి కొండ గుహల్లో చిత్రించిన రాతి చిత్రాలు ఆనాటి జంతు, మానవ రూపాలను ప్రతిబింబిస్తున్నాయి. గుంపుగా ఉన్న జంతువులను చిత్రించిన విధానం అబ్బురపరుస్తుంది. అలాగే స్త్రీ యోని భాగం ప్రధాన అంశంగా తీసికొని చిత్రించిన వైనం వేల సంవత్సరాల నాడే ఆధునిక కళాకారుని మెళకువలను పుణికి పుచ్చుకున్న ఆదిమ మానవుని నైపుణ్యం కళ్ళముందు సాక్షాత్కరింప చేస్తుంది.

